# మనం
## హైదరాబాద్
రంగారెడ్డి | మేడ్చల్

శుక్రవారం | 17 | ఏప్రిల్ | 2026 పేజీలు: 7




### సికింద్రాబాద్లో అక్రమ బోర్వెల్లపై
## ప్రజల ఆందోళన
7



2

## ఆరోగ్య కేంద్రాలు కనీస ప్రమాణాలను పాటించాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఉమా గౌరీ



## నీటి వనరుల పరిరక్షణపై అంతర్జాతీయ సహకారం అవసరం

### భారత్-ఫ్రాన్స్ పార్లమెంటరీ సమావేశంలో ఈటల రాజేందర్
2



భారత్-ఫ్రాన్స్ పార్లమెంటరీ ఫ్రెండ్షిప్ గ్రూప్ (పి ఎఫ్ జి) సమావేశం న్యూఢిల్లీలోని పార్లమెంట్ హౌస్ అనెక్సీ భవనంలో బుధవారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశానికి మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరయ్యారు. లోక్సభ స్పీకర్ ఆధ్వర్యంలో 64 దేశాలతో ఏర్పాటైన పార్లమెంటరీ ఫ్రెండ్షిప్ గ్రూప్లలో భారత్-ఫ్రాన్స్ గ్రూప్ ఒకటి కాగా, దీనికి డాక్టర్ శశిథరూర్ అధ్యక్షత వహిస్తున్నారు.

## రాష్ట్ర సహకారంపై రైల్వే దృష్టి..

దక్షిణ మధ్య రైల్వే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధికారుల మధ్య కీలక సమన్వయ సమావేశం

మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల వేగవంతానికి కీలక నిర్ణయాలు
2




## అంబేద్కర్ జయంతి సందర్భంగా దళిత రత్న అవార్డుల ప్రదానం
4



# దక్షిణ మధ్య రైల్వే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధికారుల మధ్య కీలక సమన్వయ సమావేశం

**మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల వేగవంతానికి కీలక నిర్ణయాలు..**






సికింద్రాబాద్, ఏప్రిల్ 16 (మనం న్యూస్) సికింద్రాబాద్లోని రైల్ నిలయంలో గురువారం దక్షిణ మధ్య రైల్వే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధికారుల మధ్య కీలక సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు సహా రైల్వే, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు మరియు పరిష్కార మార్గాలపై విస్తృతంగా చర్చించారు. రోడ్ అండర్ బ్రిడ్జ్ (ఆర్ యు బి), రోడ్ ఓవర్ బ్రిడ్జ్ (ఆర్ ఓ బి), కొత్త రైల్వే మార్గాలు, స్టేషన్ల అభివృద్ధి వంటి అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు.

**రాష్ట్ర సహకారంపై రైల్వే దృష్టి..**

ప్రాజెక్టుల అమలులో భూసేకరణ, ఎన్ఓసీలు, ట్రాఫిక్ మళ్లింపు, విద్యుత్ లైన్లు మరియు పైప్లైన్ల తరలింపు వంటి అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వ సహకారం కీలకమని రైల్వే అధికారులు పేర్కొన్నారు. కొత్త రైల్వే లైన్ల నిర్మాణం, వ్యయ భాగస్వామ్యం వంటి అంశాల్లో కూడా రాష్ట్ర మద్దతు అవసరమని తెలిపారు. హైదరాబాద్ను బెంగళూరు, చెన్నై, పూణే నగరాలతో అనుసంధానించే హై స్పీడ్ రైల్ కారిడార్ ప్రతిపాదనతో పాటు ప్రాంతీయ రింగ్ రైల్ ప్రాజెక్ట్పై ప్రాథమిక చర్చలు జరిగాయి.

**సమగ్ర అభివృద్ధికి పరస్పర సమన్వయం అవసరం..**

ఈ సందర్భంగా సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ, ప్రస్తుత రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పూర్తి అయితే ప్రజలకు ప్రయోజనం కలగడమే కాకుండా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మద్దతుతో ఈ ప్రాజెక్టులు వేగవంతం అవుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడుతూ, ఇటువంటి సమావేశాలు తరచుగా నిర్వహించడం అవసరమని, రైల్వే-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని సూచించారు. సమగ్ర ప్రణాళిక, పరస్పర అవగాహనతో సమస్యలను పరిష్కరించి ప్రజల శ్రేయస్సుకు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశం ద్వారా ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయాలనే లక్ష్యాన్ని అధికారులు మరోసారి పునరుద్ఘాటించారు.

# ఆరోగ్య కేంద్రాలు కనీస ప్రమాణాలను పాటించాలి

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఉమా గౌరీ**



మేడ్చల్, ఏప్రిల్ 16 ( మనం జిల్లా ప్రతినిధి): ఆరోగ్య కేంద్రాలు కనీస ప్రమాణాలను పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఉమా గౌరీ సూచించారు.మెడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో, జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. ఉమాగౌరి నేతృత్వంలో, జిల్లాలోని డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు, ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయ, కాన్ఫరెన్స్ హాల్లో ఈ సమీక్ష కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో మాతృ ఆరోగ్యం, పోషణ, కుటుంబ నియంత్రణ, టీకాలు, సంక్రమణ, అసంక్రమణ , వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతి, సిబ్బంది వివరాలు ఖాళీలు, ఔషధాల నిల్వలు, బ్యాంక్ ఖాతాల నిర్వహణ, పెండింగ్ బిల్లులు, కాయకల్ప కార్యక్రమం తదితర ముఖ్య అంశాలపై సంబంధిత ప్రోగ్రామ్ అధికారుల ద్వారా సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. ఉమాగౌరి మాట్లాడుతూ, అన్ని వైద్యాధికారులు తప్పనిసరిగా ఏ బి హెచ్ ఏ అటెండెన్స్ను సమయానికి నమోదు చేసి సంబంధిత గ్రూపులో పోస్టు చేయాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో అవసరమైన ప్రాథమిక మందులు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, గడువు సమీపంలో ఉన్న మందుల కోసం ప్రత్యేక కార్నర్ ఏర్పాటు చేయాలని, గడువు ముగిసిన మందులను నిబంధనల ప్రకారం డిస్పోజ్ చేయవలసిందిగా ఆదేశించారు. ప్రతి పి హెచ్ సి, యూ పి హెచ్ సి అప్డేటెడ్ ఈ డి డి క్యాలెండర్ను ప్రదర్శించవలసిందిగా, చిన్నపిల్లల టీకా కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం కచ్చితంగా నిర్వహించవలసిందిగా సూచించారు. గర్భిణీ స్త్రీల సేవలు, ముఖ్యంగా రక్తహీనత హై రిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రసవ సేవలను జాగ్రత్తగా నిర్వహించడం ద్వారా మాతృ మరణాలను నివారించవలసిందిగా తెలిపారు. టీబీ మరియు ఎన్ సి డి సంబంధిత రోజువారీ సేవలను నిర్లక్ష్యం చేయరాదని, ప్రతి ఆరోగ్య కేంద్రం కనీస ప్రమాణాలను పాటిస్తూ అవసరమైన పరికరాలు, మందులు అందుబాటులో ఉంచాలని, అవసరమైతే జిల్లా అధికారులను సంప్రదించాలని సూచించారు.



అలాగే, జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల వివరాల కోసం సర్వే నిర్వహించి, ఒక నెలలోపు నివేదికను డి ఎం హెచ్ ఓ కార్యాలయానికి సమర్పించవలసిందిగా ఆదేశించారు.

ఈ సమావేశంలో ప్రోగ్రామ్ అధికారులు డా. శ్రీదేవి, డా. గీతా, డా. చంద్రకళ, డా. లావణ్య, డా. కౌశిక్, డిప్యూటీ డెమో వసంత కుమారి సురేష్ జిల్లా క్వాలిటీ మేనేజర్ , తదితరులు పాల్గొన్నారు.

# నీటి వనరుల పరిరక్షణపై అంతర్జాతీయ సహకారం అవసరం

**భారత్-ఫ్రాన్స్ పార్లమెంటరీ సమావేశంలో ఈటల రాజేందర్..**



కుషాయిగూడ, ఏప్రిల్ 16 (మనం న్యూస్): భారత్-ఫ్రాన్స్ పార్లమెంటరీ ఫ్రెండ్షిప్ గ్రూప్ (పి ఎఫ్ జి) సమావేశం న్యూఢిల్లీలోని పార్లమెంట్ హౌస్ అనెక్సీ భవనంలో బుధవారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశానికి మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరయ్యారు. లోక్సభ స్పీకర్ ఆధ్వర్యంలో 64 దేశాలతో ఏర్పాటైన పార్లమెంటరీ ఫ్రెండ్షిప్ గ్రూప్లలో భారత్-ఫ్రాన్స్ గ్రూప్ ఒకటి కాగా, దీనికి డాక్టర్ శశిథరూర్ అధ్యక్షత వహిస్తున్నారు. ఫ్రెంచ్ సెనేట్కు చెందిన ఫ్రాన్స్-ఇండియా ఇంటర్ పార్లమెంటరీ ప్రతినిధి బృందం మరియు భారత సభ్యుల మధ్య ఈ సమావేశం జరిగింది.

వాటర్ రిసోర్సెస్ అంశంపై జరిగిన చర్చల్లో ఈటల రాజేందర్ మాట్లాడుతూ నీరు జీవకోటికి మూలాధారం అని పేర్కొన్నారు. ఎకాలజికల్ అసమతుల్యత, గ్లోబల్ వార్మింగ్, క్లైమేట్ మార్పులు వంటి సమస్యలకు ప్రధాన కారణం నీటి కొరతేనని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో గుజరాత్ మోడల్ను అనుసరించి ఇంటింటికీ మంచినీటి సరఫరా జరుగుతోందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచ వేదికలపై క్లైమేట్ చేంజ్, నీటి ప్రాధాన్యతపై పలుమార్లు ప్రస్తావించారని చెప్పారు. గంగా-కావేరి నదుల అనుసంధానం ద్వారా కోట్ల ఎకరాలకు నీరు అందించేందుకు కృషి జరుగుతోందని పేర్కొన్నారు. నీరు కేవలం వ్యవసాయం, తాగునీటి అవసరాలకే కాకుండా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి కూడా కీలకమని తెలిపారు. భారత్-ఫ్రాన్స్ దేశాల మధ్య నీటి వనరుల పరిరక్షణ, వినియోగంపై పరస్పర అనుభవాలను పంచుకోవడం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ గ్రూప్లో డాక్టర్ శశిథరూర్, ఏ. రాజా, నవీన్ జిందాల్, శతాబ్దీ రాయ్, రాహుల్ కస్వాన్, లహర్ సింగ్ సిరోయా, ఈటల రాజేందర్, రాజ్కుమార్ చబ్బేవాల్, అనిల్ బలూనీ, కంగనా రణౌత్ తదితరులు సభ్యులుగా ఉన్నారు.



# జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం అత్యవసరం

**– దాడులు, బెదిరింపులపై కఠిన చర్యలు తీసుకునేలా జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలి.**

కుషాయిగూడ, ఏప్రిల్ 16 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులపై పెరుగుతున్న దాడులు, బెదిరింపుల నేపథ్యంలో జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం (టీజెఎస్ఎస్) ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యానికి నాల్గవ స్థంభంగా గుర్తింపు పొందిన మీడియా ప్రతినిధులకే రక్షణ లేకపోవడం ఆందోళనకరమని ఆయన పేర్కొన్నారు.

రాజకీయ నాయకులు, కొంతమంది అధికారులు, స్థానిక నాయకులు జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. అవినీతి, అక్రమాలను వెలుగులోకి తీసుకువస్తున్నందుకు జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు.



పోలీసులు కూడా పూర్తి ఆధారాలు లేకుండానే జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం, కొంతమంది ప్రభావశీలుల ఒత్తిడికి లోనై చర్యలు తీసుకోవడం ఆందోళనకరమని గౌటి రామకృష్ణ అన్నారు. ఈ పరిస్థితులు మారాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

మీడియా విలువను తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, జర్నలిస్టులకు రక్షణ లేకపోతే ప్రజాస్వామ్యంపై నమ్మకం దెబ్బతింటుందని హెచ్చరించారు. జర్నలిస్టులు భయభ్రాంతులు లేకుండా పనిచేయాలంటే ప్రత్యేక రక్షణ చట్టం తప్పనిసరి అని పేర్కొన్నారు.

జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులను అరికట్టేందుకు కఠిన నిబంధనలతో కూడిన జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ చట్టం ద్వారా దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

జర్నలిస్టులందరూ సంఘాలకు అతీతంగా ఏకతాటిపైకి వచ్చి ఈ చట్ట సాధన కోసం పోరాడాలని గౌటి రామకృష్ణ పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చట్టం తీసుకురాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జర్నలిస్టుల భద్రత కోసం పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.


# వీఎస్టీ కాలనీలో సిమెంటు రోడ్డుకు మోక్షం

నాచారం, ఏప్రిల్ 16 (మనం న్యూస్) వీఎస్టీ కాలనీ రేణుక ఎల్లమ్మ గుడి సమీపంలోని రెండు వీధుల్లో సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఎట్టకేలకు మార్గం సుగమమైంది. సుమారు రెండేళ్ల క్రితం అప్పటి నాచారం మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ఆధ్వర్యంలో రూ.20 లక్షల నిధులు మంజూరైనా, డ్రైనేజీ సమస్యల కారణంగా పనులు ప్రారంభం కాలేదు. భూగర్భ డ్రైనేజీకి నిధులు అందకపోవడంతో ఆమోదిత నిధులు గడువు ముగియడంతో వెనక్కి వెళ్లిపోయాయి. ఈ నేపథ్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవతో సుమారు రూ.15 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించగా, పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. అనంతరం, ముందుగా వెనక్కి వెళ్లిన రూ.20 లక్షల నిధులను తిరిగి తీసుకురావడంతో సిమెంటు రోడ్డు పనులు చేపట్టడం సాధ్యమైంది. ఇప్పటికే గుడి ముందున్న రోడ్డును పూర్తి చేయగా, తాజాగా పక్క వీధిలో కూడా సిమెంటు రోడ్డు నిర్మాణం పూర్తయింది. దీంతో ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న బస్తీ వాసుల కోరిక నెరవేరింది. ఈ సందర్భంగా సిమెంటు రోడ్డు మరియు భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి సహకరించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ను స్థానికులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సువర్ణ, సుగుణాకర్ రావు, వాసు, రోహిత్, రాము, చింటూ, విష్ణువర్ధన్, షాజర్, పీటర్, హైమావతి తదితరులు పాల్గొన్నారు.



# మెడికవర్ హాస్పిటల్స్‌లో అరుదైన వైద్య విజయం

**ఇద్దరు చిన్నారులకు క్లిష్ట శస్త్రచికిత్సలు విజయవంతం..**



హైదరాబాద్, ఏప్రిల్ 16 (మనం న్యూస్) మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు అరుదైన, అత్యంత క్లిష్టమైన రెండు పీడియాట్రిక్ కేసులను విజయవంతంగా నిర్వహించి వైద్య రంగంలో విశేష ఘనత సాధించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఇద్దరు చిన్నారులకు గుండె మరియు భారీ కణితి శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేయడం విశేషం. మొదటి కేసులో, 8 సంవత్సరాల బాలిక శ్వాసలో ఇబ్బంది, మెడ నొప్పితో ఆసుపత్రికి చేరింది. వైద్య పరీక్షల్లో ఛాతి వెనుక భాగంలో సుమారు 11.6, 10.6, 8.7 సెం.మీ పరిమాణంలో భారీ కణితి ఉన్నట్లు గుర్తించారు. ఈ కణితి ముఖ్య రక్తనాళమైన అయోర్టా మరియు స్పైనల్ కాల్కు అత్యంత సమీపంగా ఉండటంతో పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ క్లిష్ట పరిస్థితిలో చీఫ్ కార్డియోథొరాసిక్ వాస్క్యులర్ సర్జన్ డా. ప్రమోద్ రెడ్డి కందకురే, న్యూరో సర్జన్ డా. అనీల్ సమన్వయంతో శస్త్రచికిత్స నిర్వహించి సుమారు 500 గ్రాముల కణితిని విజయవంతంగా తొలగించారు. శస్త్రచికిత్స అనంతరం బాలిక ఎటువంటి నర సంబంధిత సమస్యలు లేకుండా కోలుకుంటోంది. బయాప్సీ నివేదిక ప్రకారం ఈ కణితి 'గ్యాంగ్లియోన్యూరోమా' అనే కాన్సర్ కాని అరుదైన ట్యూమర్గా నిర్ధారణ అయింది. మరో కేసులో, 4 సంవత్సరాల బాలుడు పుట్టినప్పటి నుంచే పెదాలు, గోర్లు నీలం రంగులో కనిపించడం, శ్వాసలో ఇబ్బంది వంటి లక్షణాలతో ఆసుపత్రికి వచ్చాడు. పరీక్షల్లో అతనికి సింగిల్ వెంట్రికల్ ఫిజియాలజీ అనే అరుదైన గుండె లోపం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఈ పరిస్థితిలో గుండె నాలుగు గదులుగా అభివృద్ధి చెందకపోవడం వల్ల రక్తంలో ఆక్సిజన్ సరైన స్థాయిలో చేరదు. వైద్య బృందం బాలుడికి క్లిష్ట గుండె శస్త్రచికిత్స నిర్వహించగా, అనంతరం అతని రక్తంలో ఆక్సిజన్ స్థాయిలు మెరుగుపడి ఆరోగ్య పరిస్థితి స్థిరపడింది. ఈ సందర్భంగా డా. ప్రమోద్ రెడ్డి కందకురే మాట్లాడుతూ, ఈ రెండు కేసులు అత్యంత క్లిష్టమైనవి. సమగ్ర ప్రణాళిక, మల్టీడిసిప్లినరీ టీమ్ సమన్వయం, ఆధునిక సాంకేతికత వల్లే విజయవంతమైన ఫలితాలు సాధ్యమయ్యాయి. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించడం అత్యంత అవసరం అని తెలిపారు. న్యూరో సర్జన్ డా. అనీల్ మాట్లాడుతూ, స్పైనల్ కాల్కు సమీపంలోని కణితులను తొలగించడం చాలా సవాలుతో కూడుకున్నది. నరాలను కాపాడుతూ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశాం అని చెప్పారు. వైద్యులు సూచించిన ప్రకారం, ఇలాంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ముందుగానే పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రాణాపాయకర పరిస్థితులను నివారించవచ్చు.



# మజీద్పూర్ చెక్‌పోస్ట్ వద్ద చలివేంద్రం ఏర్పాటు

మేడ్చల్, ఏప్రిల్ 16 ( మనం జిల్లా ప్రతినిధి ): మేడ్చల్ మండలం, ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని 4 వార్డు మజీద్పూర్ చెక్ పోస్ట్ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీటీసీ మలోత్ అంకిత రవి నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రం ను నేడు ప్రారంభించారు.వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులు, ప్రజల దాహార్తిని తీర్చడానికి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం. ఈ సందర్భంగా మాలోత్ అంకిత రవి నాయక్ మాట్లాడుతూ మజీద్పూర్ చెక్ పోస్ట్, రహదారిలోని శ్రీ శ్రీ క్షేత్ర గిరి వేంకటేశ్వర స్వామి కమాన్ వద్ద. మజీద్పూర్ మండి చెక్ పోస్ట్ మీదుగా వెళ్లే వాహనదారులకు రాజ్ బొల్లారం తండా ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మలోత్ సంతోష్ నాయక్, మలోత్ పాండు నాయక్, కే కుమార్ నాయక్, మలోత్ రాజు నాయక్, మలోత్ రాజ్కుమార్, రవి నాయక్, మలోత్ బాబూరావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సాకేత్ ప్రణామమ్‌లో అగ్నిమాపక వారోత్సవాలు




మేడ్చల్, ఏప్రిల్ 16( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ సర్కిల్ పరిధి గుండ్ల పోచంపల్లి డివిజన్ లోని సాకేత్ ప్రణామమ్ అపార్టుమెంట్లలో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా గురువారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శామీర్పేట అగ్నిమాపక కేంద్రం అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ ధనుంజయ్ రెడ్డి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శివప్రసాద్ హాజరై నివాసితులకు అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తతపై కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా వంటగదిలో గ్యాస్ సిలిండర్ల వాడకం, గ్యాస్ లీకైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు , ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్లను ఎలా నివారించాలో వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే 101 నంబర్కు సమాచారం అందించాలని, ప్రతి ఒక్కరూ అగ్ని భద్రతపై కనీస అవగాహన కలిగి ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అపార్టుమెంట్ అసోసియేషన్ అధ్యక్షులు రామ్మోహనరావు, కార్యదర్శి వల్లభేంద్రరెడ్డి, ప్రసాదరావు , ఇతర నివాసితులు పాల్గొని అధికారుల సూచనలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాద రహిత సమాజం కోసం ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని అసోసియేషన్ ప్రతినిధులు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.







## ముడిమ్యాల్లో 'అడ్మిషన్ అవేర్నెస్' సక్సెస్

**- విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించిన జి. మహేందర్ గౌడ్, జె. మహేందర్ గౌడ్**

చేవెళ్ల, ఏప్రిల్ 16 (మనం న్యూస్) : మండల పరిధిలోని ముడిమ్యాల్ గ్రామంలో నిర్వహించిన అడ్మిషన్ అవేర్నెస్ కార్యక్రమం విజయవంతమైంది. జి. మహేందర్ గౌడ్, జె. మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు, ఉన్నత విద్య ప్రాముఖ్యతపై పాంప్లెట్ల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. సి. కాంచన లత మాట్లాడుతూ... తమ కళాశాలలో బి.ఎ, బి.కాం, బి.ఎస్సి కోర్సులతో పాటు ఆధునిక ల్యాబ్లు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని తెలిపారు. నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో విద్యా చైతన్యం నింపిన మహేందర్ గౌడ్ ద్వయానికి ప్రిన్సిపాల్ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.



## అంబేద్కర్ జయంతి సందర్భంగా దళిత రత్న అవార్డుల ప్రదానం

సికింద్రాబాద్, ఏప్రిల్ 16 (మనం న్యూస్) భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ స్ఫూర్తితో దళితుల అభ్యున్నతికి తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని మాజీ మంత్రి, సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో షెడ్యూల్ కులాల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురికి దళిత రత్న అవార్డులను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. సంఘానికి చెందిన సీనియర్ నాయకులు గోపి, నిమ్మ నాగలక్ష్మి, వివేక్, ఉదయ్, జీ, సంపత్, లడ్డు తదితరులకు తలసాని శ్రీనివాస్ యాదవ్ అవార్డులు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జయంతి ఉత్సవాల కమిటీ కో-చైర్మన్, ఎస్ సి ఆర్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డి. సుదర్శన్ బాబు, రాపాక అశోక్, దేశాపాక గోవర్ధన్, మిద్దె లింగం, ఎర్ర విజయ్ శంకర్, త్రిశూల్ శ్రీకాంత్, కే. దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహం తొలగింపు వివాదం
# నిరసనలతో ఉద్రిక్తత





**- ఆందోళనకారుల అరెస్టు - ప్రభుత్వ వైఖరిపై బిఆర్ఎస్ నేతల విమర్శలు.**

కుషాయిగూడ, ఏప్రిల్ 16(మనం న్యూస్): చర్లపల్లి బస్టాండ్లో ఇటీవల ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాలను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించడం వివాదానికి దారితీసింది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను బుధవారం అర్ధరాత్రి తొలగించడంతో గురువారం ఉదయం వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆందోళనకు దిగారు.

బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో దళిత సంఘాలు, స్థానిక నాయకులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. నిరసనలో పాల్గొన్న సోమశేఖర్ రెడ్డితో పాటు సుమారు 20 మందిని అరెస్టు చేసి ఘట్కేసర్ పోలీస్ స్టేషన్కు తరలించారు.

ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ రాజ్ బహదూర్ వెంకట్రాంరెడ్డి విగ్రహానికి లేని ఆంక్షలు అంబేద్కర్ విగ్రహానికి ఎందుకని ప్రశ్నించారు. దళితుల ప్రతినిధి అయిన అంబేద్కర్ పట్ల చిన్నచూపు చూపుతున్నారంటూ ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మహనీయుల విగ్రహాలను తొలగించడం అన్యాయమని, వెంటనే పునఃస్థాపన చేయాలని డిమాండ్ చేశారు. విగ్రహాలను తిరిగి ఏర్పాటు చేసే వరకు పోరాటం కొనసాగుతుందని, అవసరమైతే రాష్ట్రవ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. అరెస్టు అయిన వారిలో బిఆర్ఎస్ నాయకులు నేమూరి మహేష్ గౌడ్, డప్పు గిరిబాబు, కొమ్ము నర్సింగ్ రావు, కడియాల సురేష్, కేవీఎల్ఎన్ రావు, కొమ్ము సురేష్, కడియాల నాగేష్, కడియాల అనిల్ కుమార్, కొమ్ము రమేష్, బొజ్జ పవన్, ఎడ్ల సోమయ్య, పొన్నాల సురేష్, కొమ్ము శివరాజ్, విజయరాజ్ తదితరులు ఉన్నారు.

అరెస్టు అయిన వారిని హెచ్బి కాలనీ మాజీ కార్పొరేటర్ జర్రిపోతుల ప్రభుదాస్ పోలీస్ స్టేషన్లో పరామర్శించారు. ఈ ఘటన ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది.



## 2027 జనగణన తర్వాతే మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలి

సికింద్రాబాద్, ఏప్రిల్ 16 (మనం న్యూస్) కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టాలనుకుంటున్న మహిళ రిజర్వేషన్ 33% కల్పించే నారీ శక్తి వందన్ బిల్లును 2027 లో జనగణన పూర్తయి జనాభా లెక్కలు తీసిన తర్వాతనే ప్రవేశపెట్టాలని బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ ఆరట్స్ కళాశాల అవరణలో బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డిలీమిటేషన్ బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మనబోయిన సైదులు యాదవ్, ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే 'నారీ శక్తి వందన్' బిల్లును 2023లో ఆమోదించినప్పటికీ, దాని అమలు విషయంలో స్పష్టత లేకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా, బీసీలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించకుండా మహిళా రిజర్వేషన్ అమలు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. జనగణన పూర్తి చేసి, అనంతరం నియోజకవర్గాల పునర్విభజన (డిలీమిటేషన్) చేపట్టిన తర్వాతే మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. 2011 జనగణన ఆధారంగా ప్రక్రియను ముందుకు తీసుకెళ్లే ప్రభుత్వ యత్నాలను వారు వ్యతిరేకించారు. డిలీమిటేషన్ ప్రక్రియ వల్ల దక్షిణాది, చిన్న రాష్ట్రాలకు నష్టం కలిగే అవకాశం ఉందని, ఇది రాజ్యాంగంపై దాడిగా భావిస్తున్నామని విమర్శించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 82, 368 నిబంధనలను గౌరవిస్తూ అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను తీసుకోవాలని కోరారు. మహిళా రిజర్వేషన్లో బీసీ మహిళలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని, మొత్తం రిజర్వేషన్లలో 50 శాతం వాటా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బొడ సునీల్, ఓయూ విద్యార్థి నాయకులు అరుణ్ కుమార్, మనోజ్, రాఘవేంద్ర, అనిల్, కళ్యాణ్, వినోద్, శశి, ప్రభాకర్, సాయికిరణ్, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం తప్పనిసరి

**తలసాని శ్రీనివాస్ యాదవ్**

సికింద్రాబాద్, ఏప్రిల్ 16 (మనం న్యూస్) పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్పల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ ప్రాజెక్ట్ పరిధిలోని సనత్నగర్ నియోజకవర్గంలోని 22 అంగన్వాడీ కేంద్రాల టీచర్లకు సెల్ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోషకాహారం పై అవగాహన కల్పించే పోస్టర్ను కూడా ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాట్లాడిన తలసాని,



పౌష్టికాహారం వల్ల పిల్లలు, గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉండగలరని తెలిపారు. అంగన్వాడీ సిబ్బంది మెరుగైన సేవలు అందించి ప్రజల విశ్వాసాన్ని పొందాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. పోషకాహారం పంపిణీకి సంబంధించిన వివరాలను ఆన్లైన్లో నమోదు చేయడానికి ఈ సెల్ఫోన్లు ఉపయోగపడతాయని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో స్వప్న, సూపర్వైజర్లు జాహ్నవి, హరిప్రియ, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

**ఎల్లంపేట మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి**

మేడ్చల్, ఏప్రిల్ 16 ( మనం జిల్లా ప్రతినిధి ): ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎల్లంపేట మున్సిపల్ చైర్పర్సన్ శ్రీదేవి పేర్కొన్నారు.

99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎల్లంపేట మున్సిపల్ స్థాయి సభ ను నిర్వహించారు. ఎల్లంపేట మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ శ్రీదేవి మాట్లాడుతూ ప్రజల అభివృద్ధియే ప్రభుత్వ లక్ష్యం అని ఈ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పథంలో సాగాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు సైతం మాట్లాడుతూ వారి వారి శాఖల పరిధిలోని సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు.






**వార్డులలోని సమస్యలను పరిష్కరించండి**

వార్డులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పలువురు కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్లు రావడం లేదు అంటూ కొందరు, తమ వార్డులలో దోమల బెడద ఎక్కువ ఉందని ఫాగింగ్ కూడా చేయడం లేదని ఫిర్యాదు చేశారు. కొన్ని వార్డులలో మౌలిక సదుపాయాలు కల్పించాలి అంటూ మొరపెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ స్వామి నాయక్ తో పాటు, మేడ్చల్ తహసిల్దార్ భూపాల్, వ్యవసాయ, విద్యుత్, విద్యా, డి ఆర్ డి ఏ అధికారులు పలువురు ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

# తెలంగాణ అస్తిత్వంపై బీజేపీ దాడి

**క్షమాపణ చెప్పకుంటే ఆందోళనలు తప్పవు: డా. వలిగొండ నరసింహ..**




సికింద్రాబాద్, ఏప్రిల్ 16 (మనం న్యూస్) తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్-పాక్ విభజనతో పోల్చిన ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డా. వలిగొండ నరసింహ స్పందించారు. తెలంగాణ సాధన అనేది సుదీర్ఘ ప్రజాస్వామ్య పోరాట ఫలితమని, 1200 మంది విద్యార్థుల త్యాగాలతో సాధించిన రాష్ట్రాన్ని మత విద్వేషాల ఆధారంగా జరిగిన దేశ విభజనతో పోల్చడం అమరవీరుల ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని ఆయన అన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు బీజేపీ నేతల అజ్ఞానం, విద్వేషపూరిత రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. తెలంగాణలో ఓట్లు అడుగుతున్న బీజేపీ నాయకులు, ఢిల్లీలో రాష్ట్ర గౌరవాన్ని కించపరుస్తుంటే ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. మీరు తెలంగాణ బిడ్డలా లేక గుజరాత్ పాలకుల గులాములా? అంటూ ఘాటుగా విమర్శించారు. అదేవిధంగా నియోజకవర్గాల పునర్విభజన పేరుతో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై విమర్శలు చేయడం తెలంగాణ ప్రజలను అవమానించడమేనని అన్నారు. ఈ నేపథ్యంలో, తేజస్వీ సూర్య తక్షణమే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ, లేనిపక్షంలో విద్యార్థి, యువజన వర్గాలు ఆందోళనలు చేపట్టే అవకాశముందని డా. వలిగొండ నరసింహ హెచ్చరించారు.



# మంగ్లీపై అసత్య ఆరోపణలు ఖండించిన గిరిజన సంఘాలు

సికింద్రాబాద్, ఏప్రిల్ 16 (మనం న్యూస్) ప్రముఖ గాయని మంగ్లీపై వస్తున్న అసత్య ఆరోపణలను గిరిజన సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో సంఘాల నాయకులు శరత్ నాయక్, అశోక్ నాయక్, సుబ్బు నాయక్, విజయేందర్ నాయక్ మాట్లాడారు. మంగ్లీని సంబంధంలేని కేసులో ఇరికించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, ఆమె పరువు ప్రతిష్టలను దెబ్బతీయడానికి కుట్రలు జరుగుతున్నాయని వారు ఆరోపించారు. మారుమూల తండా నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన గాయని పై నిరాధార ఆరోపణలు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అమాయక ప్రజలను అధిక వడ్డీ ఆశ చూపిస్తూ కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రమావత్ మధు, హేమాకాంత్ రెడ్డి లపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. బాధితుల పక్షాన పోరాడుతూ న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని స్పష్టం చేసిన నాయకులు, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# వారసిగూడలో పాత రౌడీ షీటర్ అరెస్ట్

**- బిల్డర్లను బెదిరించి డబ్బులు వసూలు యత్నం..**

సికింద్రాబాద్, ఏప్రిల్ 16 (మనం న్యూస్) వారసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో పాత రౌడీ షీటర్ ముప్పిడి నవీన్ కుమార్ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. నిర్మాణ రంగంలో పనిచేస్తున్న బిల్డర్లను లక్ష్యంగా చేసుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడన్న ఆరోపణలతో అతనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



పోలీసుల వివరాల ప్రకారం... నవీన్ కుమార్ బిల్డర్లు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారంటూ వారిపై ఒత్తిడి తెచ్చి, లక్షల్లో డబ్బులు డిమాండ్ చేసేవాడు. డబ్బులు ఇవ్వకపోతే జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసి భవనాలను కూలగొట్టిస్తానని బెదిరించి, భయభ్రాంతులకు గురిచేసేవాడని బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై కేసు నమోదు చేసిన వారసిగూడ పోలీసులు దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది. అక్రమ వసూళ్లు, బెదిరింపులు వంటి చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడితే ఎంత పెద్ద వ్యక్తి అయినా చట్టం ముందు నిలబడాల్సిందే అని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు భయపడకుండా ఇలాంటి ఘటనలపై పోలీసులకు సమాచారం అందిస్తే, నేరాలపై కట్టడి సాధ్యమవుతుందన్నారు.

# బోయిన్‌పల్లిలో పోలీసుల భారీ కార్డెన్ సెర్చ్

**32 బైకులు, 100 ఆక్సిటోసిన్ బాటిళ్లు సీజ్..**

సికింద్రాబాద్ ఏప్రిల్ 16 (మనం న్యూస్) మల్కాజిగిరి జోన్ పోలీసుల ఆధ్వర్యంలో బోయిన్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం భారీ స్థాయిలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జోన్ డీసీపీ శ్రీధర్ పర్యవేక్షణలో సుమారు 300 మంది పోలీసు సిబ్బంది హస్మత్పేట ప్రాంతంలోని పలు ఇళ్లలో విస్తృత తనిఖీలు చేపట్టారు. నేరాల నియంత్రణతో పాటు స్థానిక సమస్యలను గుర్తించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా అధికారులు తెలిపారు. తనిఖీల సందర్భంగా సరైన పత్రాలు లేని 32 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా 100 ఆక్సిటోసిన్ బాటిళ్లు, ఒక కమర్షియల్ గ్యాస్ సిలిండర్, ఒక హుక్కా పాట్ను సీజ్ చేశారు. నంబర్ ప్లేట్లు లేని లేదా రోడ్లపై వదిలేసిన వాహనాలను స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులు స్థానికులతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుర్తించిన సమస్యలను సంబంధిత ప్రభుత్వ శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని డీసీపీ శ్రీధర్ తెలిపారు. గంజాయి వినియోగం, బహిరంగ మద్యపానం వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని, కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ప్రజల భద్రత దృష్ట్యా ఇలాంటి తనిఖీలు తరచుగా నిర్వహిస్తామని పోలీసులు స్పష్టం చేశారు.

ఈ ఆపరేషన్లో మల్కాజిగిరి అడిషనల్ డీసీపీ, బేగంపేట, తిరుమలగిరి, గోపాలపురం ఏసీపీలు, బోయిన్పల్లి సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.



# మౌలాలి-లాలాగూడ మధ్య రైలు ప్రమాదం

**గుర్తు తెలియని యువకుడు మృతి..**

సికింద్రాబాద్, ఏప్రిల్ 16 (మనం న్యూస్) మౌలాలి-లాలాగూడ రైల్వే స్టేషన్ల మధ్య ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. జీఆర్పీ పోలీసుల వివరాల ప్రకారం.. మృతుడు సుమారు 20 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు గల యువకుడిగా గుర్తించారు. అతని ఎత్తు సుమారు 5.6 అడుగులు ఉండగా, చామన ఛాయతో కోలముఖం కలిగి ఉన్నాడు. ముఖ్యంగా కుడిచేతిపై 'ఊఅఓఐఖ అనే పచ్చబొట్టు గుర్తుగా ఉంది. ప్రమాద సమయంలో అతను ఆరెంజ్, బ్లూ రంగుల రౌండ్ నెక్ టీ-షర్ట్, మెరూన్ రంగు ట్రాక్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు అధికారులు తెలిపారు. మృతుడి వద్ద ఎటువంటి గుర్తింపు పత్రాలు లభించకపోవడంతో అతన్ని గుర్తించడం కష్టంగా మారింది. ఈ ఘటనపై సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సికింద్రాబాద్ జీఆర్పీ ఇన్స్పెక్టర్ను 8712658581 లేదా దర్యాప్తు అధికారిని 9666280808 నంబర్లలో సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# పోయిన మహిళ బ్యాగ్

**కనిపెట్టి తిరిగి అప్పగించిన పోలీసులు**




సికింద్రాబాద్, ఏప్రిల్ 16 (మనం న్యూస్) చిలకలగూడ పోలీస్ స్టేషన్ సిబ్బంది మరోసారి తమ సేవా భావాన్ని, మానవత్వాన్ని చాటుకున్నారు. ఇన్స్పెక్టర్ వలిశెట్టి రామకృష్ణ మార్గదర్శకత్వంలో పనిచేస్తున్న సిబ్బంది వేగంగా స్పందించి ఓ మహిళకు పోయిన బ్యాగ్ను తిరిగి అందజేశారు. వివరాల్లోకి వెళ్తే షకీరా అనే మహిళ ఈ రోజు ఉదయం సుమారు 8:30 గంటలకు వైద్య పరీక్షల కోసం గాంధీ ఆసుపత్రికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె హ్యాండ్ బ్యాగ్ గాంధీ ఆసుపత్రి ఓపి బిల్డింగ్ వద్ద కనిపించకుండా పోయింది. ఆందోళన చెందిన ఆమె అక్కడ విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఎస్. రమణయ్యను ఆశ్రయించారు. సమాచారం అందుకున్న వెంటనే రమణయ్య అప్రమత్తంగా స్పందించి తక్షణమే బ్యాగును కనిపెట్టే పనిలోపడ్డాడు. కొద్దిసమయంలోనే ఆ బ్యాగ్ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అందులో ఉన్న మొబైల్ ఫోన్తో పాటు రూ.3000 నగదును యథాతథంగా షకీరాకు తిరిగి అప్పగించారు. ఈ సందర్భంగా షకీరా చిలకలగూడ పోలీసుల సేవలను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పాటు మానవత్వాన్ని చాటిన చిల్కలగూడ పోలీసుల చర్యలు స్థానికంగా ప్రశంసలు అందుకుంటున్నాయి.

# ఓయూలో 'కైరోస్-2026' సాహిత్య ఉత్సవానికి శ్రీకారం




సికింద్రాబాద్, ఏప్రిల్ 16 (మనం న్యూస్) ఉస్మానియా యూనివర్శిటీ ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యంలో 'కైరోస్-2026' సాహిత్య ఉత్సవాన్ని ఆరట్స్ అండ్ సోషల్ సైన్సెస్ కళాశాల భవనంలోని గది నం.133లో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఇంగ్లీష్ విభాగాధిపతి ప్రొఫెసర్ జె. సావిత్రి అధ్యక్షత వహించి, ముఖ్య అతిథులు పాల్గొన్నవారికి స్వాగతం పలికారు. ఆమె మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వ 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక 'ప్రజా పాలన ప్రగతి-ప్రణాళిక'లో భాగంగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఫిబ్రవరి 13, 2026న జరిగిన హెడ్ల సమావేశంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం ఈ కార్యాచరణ ప్రణాళికను విశ్వవిద్యాలయ స్థాయిలో అమలు చేయాలని సూచించినట్లు వివరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి కేంద్రిత కార్యక్రమాలను చురుకుగా నిర్వహిస్తున్న ఇంగ్లీష్ విభాగాన్ని అభినందించారు. విద్యార్థులు తమ ప్రతిభ, సృజనాత్మకతను ప్రదర్శించడాన్ని ప్రశంసించారు. ఇలాంటి సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల అభివృద్ధికి ఎంతో ఉపయోగకరమని, ఇతర విభాగాలు కూడా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. 'కైరోస్-2026' సాహిత్య ఉత్సవంలో భాగంగా సాహిత్య క్విజ్, లిటరరీ కొలాజ్, కవితా పఠనం (స్వీయ రచనలు), 'పోయెట్ను చిత్రించు' (పెయింట్ ఎ పోయం), మూవీ ఫ్రేమ్ గుర్తింపు, తక్షణ కథా రచన, లిటరరీ మీమ్ సృష్టి, ఇష్ట రచయితకు లేఖ, పర్ఫార్మింగ్ టెక్స్ట్, స్పెల్ బీ, లైన్స్ అండ్ లెన్సెస్, తక్షణ క్యాప్షన్ రచన వంటి వివిధ పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీల్లో విజేతలకు సాయంత్రం జరిగే వాలెడిక్టరీ కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.






# వెల్జాల్ చలివేంద్రం దగ్గర రాగి అంబలి పంపిణి

(తలకొండపల్లి ఏప్రిల్16/మనం న్యూస్): తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలోని ప్రధాన రహదారిపై తిరుమణి రాఘువేందర్ గౌడ్ ఏర్పాటు చేసిన చలివేంద్రం దగ్గర తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామనికి చెందిన వద్దే సాయి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. అనంతరం సాయి ఆధ్వర్యంలో వేసవి కాలం ప్రజల దాహార్తి తీర్చడానికి బాటసారిలకు వాహనం దారులకు రాగి అంబలి పంపిణి అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా వద్దే సాయి మాట్లాడుతూ....నాకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన మిత్రులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు వెల్జాల్ గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేసిన రాఘువేంద్ర గౌడ్ కు ప్రత్యేక ధన్యవాదాలు వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల దహార్తిని తీర్చడానికి మంచి ఆలోచనతో ఏర్పాటుచేసిన చలివేంద్రం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని గ్రామంలోని ఎస్ బి ఐ బ్యాంకు దగ్గరికి వచ్చిన ప్రజలు చల్లటి నీరు,మాజీగా,అంబలి తాగి వారి దాహార్తిని తీర్చుకుంటున్నారు.గ్రామంలో గెలిచిన ఓడిన ప్రజా అవసరాలను తీర్చడమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో,యువ నాయకుడు వానరాసి వెంకటేష్,తిరుమణి రాఘువేందర్ గౌడ్,విజయ్ యాదవ్ రమేష్ యాదవ్, ఇస్త్మల్, సుల్తాన్,మొగిలి చేట్టి లింగం,గోదా జంగయ్యా, సాయి, ఆరిఫ్,సతీష్ చారి,షాఫీ, ,పృధ్వి,గ్రామస్తులు,యువకులు,తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి**

సికింద్రాబాద్, ఏప్రిల్ 16 (మనం న్యూస్) లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్యనగర్ కమ్యూనిటీ హాల్లో గురువారం మహిళా సాధికారత, సైబర్ క్రైమ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి హాజరై సభను ఉద్దేశించి ప్రసంగించారు. మహిళల భద్రత ప్రాధాన్యతను వివరించిన ఆమె, ఆధునిక కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలు, ఫోన్ కాల్ ఫ్రాడ్స్, సోషల్ మీడియా మోసాల వంటి అంశాలపై మహిళలకు అవగాహన కల్పిస్తూ, అనుమానాస్పద లింకులు, కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని, అవసరమైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. సమాజంలో మహిళలు ధైర్యంగా ముందుకు రావాలని, చట్టపరమైన సహాయం కోసం ఎప్పుడైనా పోలీసులను ఆశ్రయించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, కాలనీవాసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## అరైవ్ అలైవ్ ప్రచారంలో భాగంగా

# ఉచిత కంటి పరీక్షా శిబిరం

సికింద్రాబాద్, ఏప్రిల్ 16 (మనం న్యూస్) రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు నిర్వహిస్తున్న అరైవ్  అలైవ్ ప్రచార కార్యక్రమంలో భాగంగా గురువారం ఓయూలోని నాన్-టీచింగ్ ఫంక్షన్ హాల్లో ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ అదనపు డిసిపి అందే రాములు, ట్రాఫిక్ ఏసిపి ఏ. శ్రీనివాస్ హాజరై శిబిరాన్ని పరిశీలించారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు మరియు ఇతర రవాణా సిబ్బందికి సరైన చూపు ఉండటం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో పెద్ద సంఖ్యలో డ్రైవర్లు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. వారికి ప్రాథమిక చూపు పరీక్షలు నిర్వహించడంతో పాటు, సురక్షిత డ్రైవింగ్లో కంటి ఆరోగ్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా చూపు లోపాల వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, డ్రైవర్లు నిరంతరం ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. కార్యక్రమంలో ఓయూ ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ, చిలకలగూడ ట్రాఫిక్ సిఐ జగన్ రెడ్డి, ఎస్త్సు లు తదితరులు సిబ్బంది పాల్గొన్నారు.




# సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

సికిందరాబాద్, ఏప్రిల్ 16 (మనం న్యూస్) సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్య కారణాలతో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ డిప్యూటీ స్టేషన్ సూపరింటెండెంట్ అందించిన సమాచారంతో రైల్వే పోలీసు ఇన్స్పెక్టర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జీఆర్పి పోలీసుల వివరాల ప్రకారం, ఏప్రిల్ 15వ తేదీన స్టేషన్లోని 10వ నెంబర్ ప్లాట్ఫాం ఒక గుర్తు తెలియని పురుషుడు సహజ మరణం చెందినట్లు రైల్వే అధికారులు తెలిపారు. మృతుని వద్ద ఎటువంటి గుర్తింపు పత్రాలు లభించలేదు. అతని



వయస్సు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల మధ్యగా ఉండగా, ఎత్తు సుమారు 5.7 అడుగులు. చామన చాయ రంగు, గుండ్రటి ముఖం కలిగి ఉండి, ఛాతీపై పుట్టుమచ్చ ఉన్నట్లు గుర్తించారు. మృతుడు తెలుపు-నలుపు చెక్స్ ఉన్న పొడవు చేతుల చొక్కా, నలుపు రంగు ట్రాక్ ప్యాంట్ ధరించి ఉన్నాడు.  మృతుని వివరాలు తెలిసిన వారు సికింద్రాబాద్ జీఆర్పీ ఇన్స్పెక్టర్ను 8712658581 నంబర్కు లేదా దర్యాప్తు అధికారిని 9666280808 నంబర్కు సంప్రదించి సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# సికింద్రాబాద్లో అక్రమ బోర్వెల్లపై ప్రజల ఆందోళన

*సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో అక్రమ బోర్వెల్ తవ్వకాలపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తార్నాక, మెట్టుగూడ, అడ్డగుట్ట, లాలాపేట తదితర ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా కొంతమంది నిబంధనలకు విరుద్ధంగా బోర్వెల్లు వేస్తున్నారని ఆరోపిస్తున్నారు.*

సికింద్రాబాద్, ఏప్రిల్ 16 (మనం న్యూస్) సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో అక్రమ బోర్వెల్ తవ్వకాలపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తార్నాక, మెట్టుగూడ, అడ్డగుట్ట, లాలాపేట తదితర ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా కొంతమంది నిబంధనలకు విరుద్ధంగా బోర్వెల్లు వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ కారణంగా భూగర్భ జలాలు వేగంగా తగ్గిపోతున్నాయని, భవిష్యత్తులో తాగునీటి సమస్య మరింత తీవ్రం కావచ్చని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. స్థానికుల ప్రకారం, అక్రమ బోర్వెల్ల వల్ల ప్రభుత్వం ఆదాయం కోల్పోవడంతో పాటు బస్తీల్లో నివసించే ప్రజలకు నీటి కొరత పెరుగుతోంది. ఈ సమస్యపై పలుమార్లు మారేడుపల్లి ఎమ్మార్వో కార్యాలయానికి ఫిర్యాదులు చేసినప్పటికీ, సంబంధిత అధికారులు స్పందించకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో




కొంతమంది బోర్వెల్ నిర్వాహకులు అక్రమంగా వ్యాపారం చేస్తూ లాభాలు పొందుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతి లేకుండా బోర్వెల్ తవ్వకాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కొందరు ముడుపులు తీసుకుంటున్నారనే అనుమానాలను కూడా స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ బోర్వెల్లపై కఠిన చర్యలు తీసుకుంటారా లేదా అనే దానిపై ప్రజలు, నెటిజన్లు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ఈ క్రమంలో గురువారం తార్నాకలోని స్ట్రీట్ నెంబర్ 10 లో అనుమతులు లేకుండా 6 1/2 ఇంచుల బోర్ వెల్ వేస్తున్నారని మారేడుపల్లి ఎమ్మార్వో అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు రెవెన్యూ అధికారులు బోర్ వెల్ వేస్తున్న ప్రదేశానికి వెళ్లి అనుమతులకు సంబంధించిన పత్రాలు తనిఖీ చేసి బోర్వెల్ వేయడానికి ఎటువంటి అనుమతి లేదని నిర్ధారణ చేసుకున్నారు. అనుమతులు లేకుండా వేస్తున్న బోర్వెల్ పై చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయమై మారేడుపల్లి ఎమ్మార్వో ను 'మనం' దినపత్రిక విలేకరి సంప్రదించగా అనుమతులు లేకుండా వేస్తున్న బోర్వెల్ పై చర్యలు తీసుకోవడం జరిగిందని తెలియజేశారు.



# ఇంటర్ ఫలితాల్లో జానకి ప్రభంజనం

**- రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్!**

చేవెళ్ల, ఏప్రిల్ 16 (మనం న్యూస్): ఇంటర్ ఫలితాల్లో దేవుని ఎరవల్లికి చెందిన తూర్పతి జానకి సత్తా చాటింది. బైపీసీ విభాగంలో 440కి 437 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు కైవసం చేసుకుంది. జానకి ప్రతిభను గుర్తిస్తూ స్థానిక కౌన్సిలర్ కరికే మీనాక్షి సత్యనారాయణ ఆధ్వర్యంలో  ఘనంగా సన్మానం జరిగింది. ఈ సందర్భంగా జానకితో పాటు ఆమె తండ్రి యాదయ్యను శాలువాతో సత్కరించారు. పేదరికాన్ని జయించి జానకి సాధించిన విజయం అందరికీ స్ఫూర్తిదాయకమని కౌన్సిలర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో  సామ మాణిక్య రెడ్డి, విఠల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇబ్బందులు కలిగించిన పాత నేరస్థుడికి 30 రోజుల జైలు శిక్ష

సికింద్రాబాద్, ఏప్రిల్ 16 (మనం న్యూస్) చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా అనుమానాస్పదంగా తిరుగుతూ, ఇతరులకు హాని కలిగించే చర్యలకు పాల్పడుతున్న ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చిలకలగూడ పోలీస్ ఇన్స్పెక్టర్ వలిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ జరపగా, అతను పాత నేరస్తుడని గుర్తించారు. నిందితుడిని పి. కార్తిక్ (25), తండ్రి (లేట్) యాదగిరి, వృత్తి ప్రైవేట్ ఉద్యోగి, నివాసం భోయిగూడ, సికింద్రాబాద్గా గుర్తించారు. తదుపరి చర్యలలో భాగంగా కేసు నమోదు చేసిన పోలీసులు, కోర్టు కానిస్టేబుల్ బి. శ్రీనివాస్ సహకారంతో నిందితుడిని సికింద్రాబాద్ కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం కోర్టు నిందితుడికి 30 రోజుల జైలు శిక్ష విధించింది. జరిమానా విధించలేదు. ఈ ఘటన ద్వారా నేరాలకు పాల్పడే వారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.

